పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్

హనుమకొండ : మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఖిలావరంగల్/హనుమకొండ, మే 18: ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం వేర్వేరుగా ఆయా కలెక్టరేటర్లలో గ్రూప్ 1 ప్రిలిమ్స్, ఇంటర్మీడియట్, ఎస్ఎస్సీ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. పరీక్షల నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఆర్టీసీ బస్సులను నడపాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వరంగల్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఆర్డీవో సిదం దత్తు, డీఐవో మాధవరావు, ఎన్‌పీడీసెల్ ఎస్సీ మధుసూదన్, గ్రూప్-1 పరీక్షల జిల్లా సమన్వయ కర్త చంద్రమౌళి పాల్గొన్నారు. హనుమకొండలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకటిరెడ్డి, డీసీపీ రవీందర్, ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఎంహెచ్‌వో సాంబశివరావు పాల్గొన్నారు.

భూసేకరణను వేగవంతం చేయాలి

వరంగల్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ప్రావీణ్య

ఖిలావరంగల్, మే 18 : వరంగల్ జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, నేషనల్ హైవే, రైల్వే, ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. భూసేకరణను పూర్తి చేసి, రైతులకు చెల్లించిన, చెల్లించాల్సిన పరిహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో డీఆర్వో శ్రీనివాస్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, కుడా పీవో అజిత్‌రెడ్డి, టీజీ ఐసీ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు టీఎస్ స్థానంలో టీజీని తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ పోర్టల్ ఫారంలు.. ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం టీజీని వాడాలని ఆమె కోరారు.

స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతర నిఘా

కాశీబుగ్గ: ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం గట్టి నిఘా ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఎనుమాముల మార్కెట్ గోదాంలను శనివారం ఆమె తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఎస్సై పోగుల శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో 'శివాని' ప్రతిభ

అధిక మార్కులు సాధించిన విద్యార్థులు

హసన్‌పర్తి, మే 18: ఈఏపీసెట్-2024 ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ టీ స్వామి శనివారం తెలిపారు. జీ వర్షిత, సీహెచ్ సాద్విక, వీ అశ్విత, కే శ్రీజా, డీ స్వేత, టీ జ్ఞానేశ్, ఏ నిస్సి, ఆర్ తిరుపతి, వీ రిషితప్రియ, టీ శ్రుతి, ఏ అఖిల్, జీ సంగీత, ఎం.జశ్వంత్, ఎస్.ప్రవంతి, ఓ రమేశ్, కే ప్రవళిక, పీ అక్షయ, ఆర్ శివప్రసాద్, ఎండీ రియాజ్, బీ బన్నీ, డీ సంజయ్‌కుమార్, బీ వెన్నెల, జీ చందన, ఎం.రితీశ్, బీ వెన్నెల, బీ సింధు, బీ శ్రీజ, సీ శశివర్ధన్, బీ భువన, టీ స్పందన, వీ శ్రీజ్, కే రస్మిత, జీ శివాని, బీ వాసవి, కే మేఘన ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపాళ్లు జీ సురేందర్‌రెడ్డి, వీ చంద్రమోహన్, డైరెక్టర్ టీ రాజు, ఎన్.రమేశ్, ఏ మురళి, వీ సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీవర్షిణికి మూడోర్యాంకు

హనుమకొండ చౌరస్తా, మే 18 : ఎప్‌సెట్ ఫలితాల్లో హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన కేటగిరిలో రెడ్డికాలనీకి చెందిన గడ్డం శ్రీవర్షిణి 145.26 మార్కులు సాధించింది. గడ్డం కన్నయ్య-లావణ్య దంపతుల కూతురు శ్రీవర్షిణి హనుమకొండలోని ఆర్యభట్ట స్కూల్‌లో చదివింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్యలో బైపీసీ పూర్తిచేసింది. డాక్టర్ అయి ప్రజలకు సేవ చేయడమే ఆమె లక్ష్యమని తెలిపింది.

ఘనంగా వాసవీమాత జయంతి

పోచమ్మమైదాన్/గిర్మాజీపేట/నల్లబెల్లి/నెక్కొండ, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి వేడుకలను శనివారం వరంగల్ జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ములుగు రోడ్డులోని వాసవీమాత ఆలయంలో అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఆధ్వర్యంలో పెనుగొండ శ్రీవాసవీమాత దర్శనానికి వెళ్లి వచ్చిన 1500 మంది భక్తులను వాసవీరత్న అవార్డులతో సత్కరించారు. రామన్నపేటలోని వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం శోభాయాత్రను పొట్టి శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, దాచేపల్లి సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించారు. నల్లబెల్లిలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు నీలా వెంకటేశ్వర్లు నివాసంలో కన్యకాపరమేశ్వరీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెక్కొండలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో వాసవీమాతకు ఆర్యవైశ్యులు పంచామృతాలతో అభిషేకం చేశారు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Financial Syndicate
పస్రానాగారం (6774) శాఖ
ఇం.నెం. 5-92, పంచాయతీ కాంప్లెక్స్ ఎదురుగా, మెయిన్ రోడ్, ములుగు జిల్లా-506 347.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: 21-06-2024న ఉ॥ 11.00 గం. నుండి మ॥ 12.00 గం. మధ్య (అమ్మకం ముగిసే వరకు ప్రతిసారి 5 నిమిషాల కాలవ్యవధితో అపరిమిత పాడిగింపుతో) బయానా డిపాజిట్ చేయుటకు ఆఖరి తేది: 20-06-2024న సా॥ 4.00 గం. వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, దిగువ తెలిపిన విధంగా కెనరా బ్యాంక్‌కు బకాయిలు ప్లస్ దానిపై లెక్కించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే విధంగా"** విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు), సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు: శ్రీమతి మొండెల అరుణ (రుణగ్రహీత), భర్త: మొండెల మధుకర్, ఇం.నెం. 2-10-309/1/2/A, డాక్టర్ కాలనీ ఫేజ్-3, వడ్డేపల్లి, వరంగల్-506 001. **శ్రీ మొండెడ్ల మధుకర్ (ఉమ్మడి రుణగ్రహీత), తండ్రి: ఐలయ్య,** ఇం.నెం. 2-10-309/1/2/A, డాక్టర్ కాలనీ ఫేజ్-3, వడ్డేపల్లి, వరంగల్-506 001. **శ్రీమతి మొండెల అరుణ (రుణగ్రహీత), భర్త: మొండెల మధుకర్,** ఇం.నెం. 7-104, జంగుపల్లి గ్రామం, ములుగు ఘన్‌పూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి-506 168.

మొత్తం బకాయిలు: రూ. 30,83,634.18 (ముప్పై లక్షల ఎనభై మూడు వేల ఆరు వందల ముప్పై నాలుగు రూపాయల పద్దెనిమిది పైసలు మాత్రమే) మరియు లెక్కించని వడ్డీ, బ్యాంక్ చార్జీలు, ఖర్చులు & వ్యయాలు.

స్థిరాస్తి వివరణ: వరంగల్ అర్బన్, హన్మకొండ, వడ్డేపల్లి గ్రామం, ఫేజ్-3, డాక్టర్స్ కాలనీ వద్దగల, SRO వరంగల్‌లో అమలు చేయబడిన డాక్యుమెంట్ డీడ్ నెం. 19296/2019, తేది: 31-07-2019 ప్రకారం, 100 చ.గజాల విస్తీర్ణపు నెం. 2-10-309/1/2/A గల ఇంటి యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నెం. 36, పడమర: ప్లాట్ నెం. 34, ఉత్తరం: ప్లాట్ నెం. 40, దక్షిణం: 33 అడుగుల వెడల్పు రోడ్.

రిజర్వు ధర: రూ .34,01,100/- **బయానా: రూ.3,40,000/-**

ఆస్తిని 17-06-2024న ఉ॥ 10.00 గం. నుండి సా॥ 4.00 గం. మధ్య తనిఖీ చేసుకోవచ్చును.

రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని అధీకృత అధికారి, కెనరా బ్యాంక్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించవలెను లేదా **కెనరా బ్యాంక్, పస్రానాగారం శాఖ, A/c. No. 209272434, IFSC కోడ్: CNRB0006774** అకౌంట్‌కు జమ అయ్యేలా RTGS/NEFT/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా డిపాజిట్ చేయాలి.
*బ్యాంకుకు తెలిసినంత వరకు ఎలాంటి తాకట్టు రుణభారాలు లేవు.
*ఆస్తి బ్యాంక్ యొక్క లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనంలో ఉన్నది.
అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం **కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com)**లో ఏర్పాటు చేసిన 'ఇ-వేలం' లింక్‌ను రిఫర్ చేయండి లేదా ఏదేని పని రోజున కార్యాలయ వేళల్లో సంప్రదించండి: శాఖ మేనేజర్, కెనరా బ్యాంక్, కరీంనగర్ శాఖ. **ఫోన్ నెం: 9448117115.**

తేది: 17-05-2024, ప్రదేశం: వరంగల్. **అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.**

నాలాల పూడికతీత పనుల్లో వేగం పెంచాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ : నగరంలోని నాలాలను పరిశీలిస్తున్న గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మే 18 : నాలాల పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం గ్రేటర్ పరిధిలోని దర్గా కాజీపేట, కాజీపేట రైల్వేట్రాక్, హంటర్ రోడ్ జూపార్క్, నందిహిల్స్, జూలైవాడ ఎస్టీ హాస్టల్, అంబేద్కర్ భవన్, ప్రెసిడెన్సీ పాఠశాల, గుండ్ల సింగారం ప్రాంతాల్లోని నాలాల పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్న తరుణంలో వారం రోజుల్లో నాలాల పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం ఉండొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శివానంద్, అజ్మీరా శ్రీకాంత్, ఏఈలు హరికుమార్, మేనక విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్, కరుణాకర్, భీమయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించాలి

గ్రేటర్‌లో పారిశుధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరుగాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నివేదిక అందజేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు మాదాసి సాంబయ్య, భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు..

బల్దియాలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు కమిషనర్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇంజినీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ రవితోపాటు గత కమిషనర్ సంతకాలు చేసిన ఎంబీలను సరిగ్గా చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ సుమలత, డీబీ సెక్షన్ ఉద్యోగి బాలునాయక్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి

40వ డివిజన్ పరిధిలోని డీకే నగర్, ఉప్పరోని కుంట ప్రాంతాల్లో వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈ మేరకు కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. అలాగే, నగరంలోని లక్ష్మీపురం సర్వే నంబర్ 96/ఏలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఓరుగల్లు చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు వక్కల కుమార్ బృందం గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం అందజేసింది. భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గిర్మాజీపేట : బొందివాగు నాలా నీటి వల్ల వర్షాకాలంలో 29వ డివిజన్‌లోని మునిగిపోతున్న రామన్నపేట, ప్రియదర్శినికాలనీ, రఘునాథకాలనీ, గాంధీబొమ్మ ఏరియాలోని పలు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. తాళ్లపల్లి రమేశ్, గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు, మే 17 : మరమ్మతుల నేపథ్యంలో ఐనవోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఐనవోలు ఫీడర్, వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని రఘునాథ్‌పల్లి ఫీడర్‌లోని వెంకటాపురం వ్యవసాయ బావులు, కొండపర్తి సబ్‌స్టేషన్ పరిధి భట్టుపల్లి ఫీడర్ పరిధిలోని కొండపర్తి వ్యవసాయ బావులకు ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఐనవోలు ఏఈ శివకుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'దోస్త్' కేంద్రం ప్రారంభం

పరకాల, మే 18 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ కోరారు. కళాశాల ఆవరణలో శనివారం దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభించారు. సమాచారం కోసం 9963310073, 95732956412 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

గిర్మాజీపేట, మే 18 : వ్యక్తి అదృశ్యంపై ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గకు చెందిన ఇనిగాల బాబు ఈ నెల 9న సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంతకూ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో మహిళ ..

పిల్లలతో రమ్య (ఫైల్)

ఎల్కతుర్తి, మే 18 : మండలంలోని కోతులనడుమకు చెందిన తిరుపతి రమ్య(30) తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ చెప్పారు. గ్రామానికి చెందిన రాజుకు భార్య రమ్యతో పాటు ఇద్దరు కుమారులు సాత్విక్(10), తేజేశ్వర్(8) ఉన్నారు. అయితే ఈ నెల 15న రమ్య తన కుమారులతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712685130 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హసన్‌పర్తిలో దొంగతనం

హసన్‌పర్తి, మే 18 : బీరువాను పగులగొట్టి బంగారం, నగదును ఎత్తుకెళ్లిన ఘటన హసన్‌పర్తిలో శనివారం జరిగింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని నల్లగట్టుగుట్ట శివసాయి కాలనీకి చెందిన మహ్మద్ ఖురేష్ శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. శనివారం ఉదయం లేచి చూసే సరికి ఇంటి తలుపు, బెడ్ రూంలోని బీరువా పగులగొట్టి ఉంది. సుమారు రూ.3.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 24 వేల వెండి ఆభరణాలు, రూ.16 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఖురేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

పర్వతగిరి, మే 18: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నారం షరీఫ్ గ్రామంలో జరిగింది. ఎస్సై జీ వెంకన్న కథనం ప్రకారం.. గూబ ఎల్లయ్య తన కూతురు వసంత(22)ను మల్లం శ్రీకాంత్ ఇచ్చి వివాహం జరిపించాడు. శ్రీకాంత్‌కు వేరే యువతితో అక్రమ సంబంధం ఉంది. ఈ క్రమంలో అతడు భార్యను తరచూ వేధిస్తున్నాడు. శ్రీకాంత్ తల్లి కోమల, మేనమామ అంబటి కుమార్ అతడికి సహకరిస్తున్నారు. ఈ విషయంలో ప్రశ్నించిన వసంతను ఉంటే ఉండు.. లేకుంటే చచ్చిపో.. అని శ్రీకాంత్, అతడి తల్లి, మేనమామ అనడంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎల్లయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

వేలేరు, మే 18 : యువతి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిత తెలిపారు. పీచర గ్రామ శివారు వావిలాలకుంట తండాకు చెందిన బానోత్ శిరీష (20) గత నెల 25న తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. కాగా, శిరీష మృతిపై పలు అనుమానాలు వెలువడగా, ఏప్రిల్ 30న కాజీపేట ఏసీపీ తిరుమల్, ధర్మసాగర్ సీఐ మహేందర్, వేలేరు తహసీల్దార్ హెచ్ కొమి ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. శిరీష ఆత్మహత్యకు పాల్పడడానికి ఆమె తండ్రి నారాయణ, అన్నయ్య అనిల్ కారణమని విచారణలో తేలింది. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. హనుమకొండలో చదువుకుంటున్న శిరీష ఓ అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకోబోతున్నదని తెలిసి ఆమెను ఇంటికి తీసుకువచ్చి గదిలో బంధించి వేధించగా, ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తల్లిని కొట్టిన కొడుకుపై కేసు

ఎల్కతుర్తి, మే 18 : మండలంలోని పెంచికల్‌పేట గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మిని చితకబాదిన ఆమె కుమారుడు రఘుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ చెప్పారు. లక్ష్మీ పేరిట రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో కూతురు వివాహానికి పసుపు, కుంకుమ కింద 20 గుంటలు, తన సంరక్షణ కోసం మరో 20 గుంటల భూమిని ఉంచుకొని మిగతా ఎకరం భూమిని ఇద్దరు కుమారులకు పంచింది. పెద్ద కుమారుడు తన భూమిని పట్టా చేసుకున్నాడు. అయితే, చిన్న కుమారుడు రఘుపతి మాత్రం తల్లి పేరు మీద ఉన్న భూమిని తనకే ఇవ్వాలని నానా బూతులు తిడుతూ కర్రతో తల్లిని చితకబాదాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రఘుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వేస్టేషన్ సమీపంలో మృతదేహం

ఖిలావరంగల్, మే 18: వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో స్థానికులు ఇంతెజార్‌గంజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడు ముస్లిం వ్యక్తిగా ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

సంగెం, మే 18 : విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన ఘటన శనివారం మండలంలో జరిగింది. బిక్కోజీనాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సపావట్ తండాకు చెందిన రైతు బానోత్ రమేశ్ తన ఎడ్లను మేత కోసం ఎల్గూర్‌రంగంపేట శివారుకు తోలుకుపోయాడు. రెండు రోజుల క్రితం ఈదురు గాలుల వల్ల ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు లూజై భూమికి అందే రీతిలో ఉన్నాయి. మేత కోసం వెళ్లిన కాడెద్దుకు ఆ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రూ.50వేలు నష్టపోయినట్లు తెలిపారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

ఆటోపై విరిగి పడిన చెట్టు

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

భీమదేవరపల్లి, మే 18 : గాలివాన బీభత్సానికి భీమదేవరపల్లి క్రాసింగ్ వద్ద ఆటోపై చెట్టుకొమ్మ విరిగిపడింది. దీంతో ఆటో డ్రైవర్ తాళ్లపల్లి కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. కొప్పూరు గ్రామానికి చెందిన కృష్ణ ప్రతిరోజు ముల్కనూరులో ఆటో నడుపుతున్నాడు. పనులు ముగించుకుని శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా గాలివాన బీభత్సానికి చెట్టు కొమ్మలు విరిగి ఆటోపై పడ్డాయి. గాయపడిన కృష్ణను స్థానికులు ముల్కనూరులోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

'పట్టభద్రులు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి'

నెక్కొండ/నల్లబెల్లి, మే 18 : వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి పార్టీకి పట్టం కట్టాలని నెక్కొండ ఎంపీపీ జాటోత్ రమేశ్, సొసైటీ చైర్మన్ మారం రాము, పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ భర్తీ చేసిన ఉద్యోగాలనే తాను చేశానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్ అని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, మాజీ వైస్ చైర్మన్ సారంగపాణి, వీరస్వామి, సత్యం, వాగ్యానాయక్ పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పట్టభద్రుడు బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చెట్టుపెల్లి మురళీధర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, గందె శ్రీనివాస్‌గుప్తా, మోహన్‌రావు, ఎంపీటీసీ జన్ను జయరావ్ పాల్గొన్నారు.

నెక్కొండ : సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నల్లబెల్లి: మాట్లాడుతున్న సారంగపాణి

కేయూ, ఆర్ట్స్ కాలేజీల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ప్రచారం

హనుమకొండ చౌరస్తా, మే 18 : ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కేయూ, ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేసి నగర వాసులను కలుసుకొని